క్లుప్తంగా

దిశ కమిటీ పర్యటన



దాసరివాడలో స్థానికులతో మాట్లాడుతున్న వనజ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ, దాసరివాడ గ్రామాల్లో ఆదివారం దిశ కమిటీ సభ్యురాలు తిప్పని వనజ, బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్ పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. దాసరివాడలో ప్రజలు తమ సమస్యల గురించి వివరించారు. విద్యుత్, తాగునీటి సమస్యతోపాటు ఆర్టీసీ బస్సులు ఆపడంలేదని వారి వద్ద వాపోయారు. జిల్లా అధికారులకు ఈ సమస్యల గురించి తెలియజేసి పరిష్కారానికి కృషిచేస్తానని వనజ హామీ ఇచ్చారు. ఆమె వెంట పరశురాములు, భాస్కర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నేతల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం ములుగు రాజీవ్ రహదారిపై ఆ పార్టీ నేతలు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి సరిపడా యూరియా సరఫరా చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. యూరియాను వెంటనే అందజేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేసినందుకు ఆయనపై దాడులకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విజయమోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్‌గుప్తా, నాయకులు సలీం, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి, తారక సురేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



ఫోన్లు అందుకున్న వారితో సీఐ రవికుమార్

గజ్వేల్‌రూరల్: రికవరీ చేసిన సుమారు రూ. 1.90 లక్షల విలువచేసే 16 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామని సీఐ రవికుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకొంటే సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొంటే దానిని గుర్తించగలమన్నారు. సెల్‌ఫోన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఆ సైట్‌లో నమోదు చేయాలని, ఆధునిక శాంకేతికతను ఉపయోగించి ఎక్కడుందో కనిపెట్టవచ్చని చెప్పారు. సెల్‌ఫోన్లు అందుకున్న బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు



పనులు పరిశీలిస్తున్న మల్లేశంగౌడ్

మిరుదొడ్డి(దుబ్బాక): ఇటీవల కురిసిన వర్షాలకు అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి-ఖాజీపూర్ గ్రామాల శివారులో ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేయించినట్లు స్థానిక నేత బాలమల్లేశంగౌడ్ తెలిపారు. మరమ్మతు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వీరారెడ్డిపల్లి ఖాజీపూర్ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, ఈ క్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులను పూర్తి చేయించామని చెప్పారు. కార్యక్రమంలో బాలకృష్ణ, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వరకు పాదయాత్ర చేస్తాం

హుస్నాబాద్: ఎస్టీ జాబితా నుంచి బంజారాలను తొలగించాలన్న కాంగ్రెస్ నాయకుల వైఖరిని నిరసిస్తూ హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర చేస్తామని గిరిజన నాయకులు తెలిపారు. పట్టణంలోని బంజారా భవన్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరిస్తామన్నారు. అలాగే సీపీఐ నుంచి చాడ వెంకట్‌రెడ్డి, బీజేపీ నుంచి కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్‌ఎస్ నుంచి హరీశ్‌రావును కలిసి వారి మద్దతు కోరాలని నిర్ణయించినట్లు తెలిపారు. సీనియర్ న్యాయవాదులను కలిసి కోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేస్తామని చెప్పారు. సమావేశంలో గిరిజన నాయకులు బీలు నాయక్, కిషన్ నాయక్, సరోజన, శారద, వీరన్న నాయక్, రాంచంద్రం నాయక్, శ్రీనివాస్ నాయక్, రమేశ్ నాయక్ తదితరులు ఉన్నారు.

మొదలైన స్థానిక సందడి

విడుదలైన ఓటరు జాబితాలు
- రంగం సిద్ధం చేసుకొంటున్న నేతలు
- ప్రారంభమైన ఆశావహుల పైరవీలు
- విందులతో వేడెక్కుతున్న గ్రామాలు



కొండపాక పంచాయతీ భవనం

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్, ఎంపీటీసీల పదవీకాలం జనవరితో ముగియడంతో ప్రభుత్వం పంచాయతీల నిర్వహణ బాధ్యత ప్రత్యేకాధికారులకు అప్పగించింది. ఈ క్రమంలో ప్రభుత్వం ఓటర్ల జాబితాలను విడుదలచేసింది. అధికారులు వాటిని ఆయా పంచాయతీల నోటీసు బోర్డుల్లో ప్రదర్శన ఉంచారు. అఖిలపక్ష నాయకులతో సమావేశాలు నిర్వహించారు. తప్పొప్పుల సవరణలు చేసుకునేలా అవకాశం కల్పించారు. దీంతో వివిధ రాజకీయపార్టీల ఆశావహులు ఓటరు జాబితాపై దృష్టి సారించారు. పోటీలో పాల్గొనే నాయకులు తమ సరంజామా సిద్ధం చేసుకుంటున్నారు.

ఓటర్లు ఇలా..

కొండపాక మండలంలో 26,376 మంది ఓటర్లకుగాను 12,996 మంది పురుషులు, 13,376 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. మండల వ్యాప్తంగా 15 పంచాయతీలు, 10 ఎంపీటీసీ స్థానాలున్నాయి. కుకునూరుపల్లి మండలంలో 15,030 మంది ఓటరులకు గాను 7,353 మంది పురుషులు, 7,657 మంది మహిళలున్నారు. మండల వ్యాప్తంగా 14 పంచాయతీలు 5 ఎంపీటీసీ స్థానాలున్నాయి. సెప్టెంబరులో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందన్న ప్రచారంతో గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

మొదలైన రహస్య సమావేశాలు

సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావహులు అసంతృప్తులను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో ఆశావహులు ఓటరులను ప్రసన్నం చేసుకునేందుకు రహస్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల రిజర్వేషన్ల స్థానాలు మునుపటి మాదిరిగానే ఉంటాయా? మారే అవకాశం ఉందా? అన్న సందేహాలు ఆశావహులను సందిగ్ధంలో పడేశాయి. అయినా తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు పథకాలు రూపొందిస్తున్నారని సమాచారం. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, అనంతరం సర్పంచ్‌ల ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం సాగుతుండటంతో ఎంపీటీసీగా పోటీచేసి ఓడిపోతే సర్పంచ్ పదవికి పోటీ చేసే అవకాశం ఉందని ఆశావహులు ముందుకు పోతున్నారు.

ఎవరి ధీమా వారిది..

తాము అమలు చేసిన సంక్షేమ పథకాలే తమకు ఎక్కువ స్థానాలు తెస్తాయని కాంగ్రెస్ నాయకులు ధీమాగా ఉన్నారు. అలాగే ప్రభుత్వంపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత తమకు కలిసి వస్తుందనే ఆలోచనలో ప్రతిపక్ష పార్టీల నాయకులున్నారు. మొత్తానికి ఎవరి పనులు, పైరవీల్లో స్థానిక నేతలు నిమగ్నమయ్యారని స్థానికులు అనుకుంటున్నారు.

బీసీ రిజర్వేషన్లపైనే దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి చట్టం రూపొందించింది. దీంతో ఆయా పార్టీల బీసీ వర్గాలు అధినాయకత్వం చుట్టూ తిరుగుతున్నారు. అవకాశం దక్కేలా చూడాలంటూ పైరవీలు ప్రారంభించారు. బీసీలకు 42 శాతం అమలు, ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేసింది.

రోడ్ల మరమ్మతులు చేయించండి

- విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో ధ్వంసమైన రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అసెంబ్లీలో విన్నవించారు. ఆదివారం నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వరదల వల్ల సిద్దిపేట జిల్లాలో చాలా గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని రోడ్లు ధ్వంసం కావడంతో గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయని దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పీఆర్, ఆర్‌అండ్‌బీ రోడ్లతోపాటు కల్వర్టులు ధ్వంసం కావడంతో పరిస్థితి దారుణంగా తయారైందని కలెక్టర్లకు విన్నవిస్తే నిధులు లేవంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా వర్షాలకు చాలా గ్రామాలు, పొలాల్లో స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వాపోయారు. విద్యుత్ స్తంభాలు వేయడానికి నిధులు లేవంటున్నారని.. దీనిపై ప్రభుత్వం వెంటనే అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు. అలాగే నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి



తొగుటలో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

తొగుట(దుబ్బాక): ప్రధాని మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహార్ ఎన్నికల్లో గెలిచే సత్తాలేక తీవ్రమైన ఆరోపణలు చేయడం రాహుల్‌గాంధీకి తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నర్సింహులు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, కర్ణాకర్, చంద్రశేఖర్‌గౌడ్, నవీన్‌రెడ్డి, స్వామి, సంజయ్, రాకేశ్ పాల్గొన్నారు.

కేసులు నమోదు చేయాలి

దుబ్బాకటౌన్: అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీపై కేసు నమోదు చేయాలని బీజేపీ రాయపోల్ మండల నాయకులు డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎస్‌ఐలు మానస, మహిపాల్‌రెడ్డి వారిని ఆదివారం ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మంకిడి స్వామి, జిల్లా నాయకులు మాదాస్ వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు.

ఆదివారం.. ఆఫీసులో బిజీబిజీ



ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితా పనిలో నిమగ్నమైన అధికారులు

సిద్దిపేటఅర్బన్: సాధారణంగా ప్రభుత్వ అధికారులు పనిదినాలలో సైతం అందుబాటులో ఉండరు.. ఇక ఆఫీసు సమయం అయిదంటే ఒక్క నిమిషం కూడా ఉండరు.. అనే ఆరోపణలున్నాయి. అలాంటిది ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ అధికారులు ఆఫీస్‌లో బిజీబిజీగా పనిలో నిమగ్నమయ్యారు. ఓటర్ల తుదిజాబితాలో అనేక ఫిర్యాదులు రావడంతో సిద్దిపేట అర్బన్ ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఆ పనిలో బిజీగా పని చేశారు. ఎంపీఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆపరేటర్ల సహాయంతో ఫిర్యాదుల పరిష్కరించే పనిలోపడ్డారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల తుది జాబితా సిద్ధం చేస్తున్నట్లు ఎంపీఓ తెలిపారు. కాగా మండలాల వారీగా ఓటర్ల తుది జాబితా సోమవారం జిల్లా కార్యాలయంలో అందించాల్సి ఉంది. దీంతో ఆదివారం సెలవు తీసుకోకుండా వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సిద్దిపేటఅర్బన్: మండలంలోని తడ్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-94 లో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. చదువుకునే సమయంలో జరిగిన ఘటనలను గుర్తుచేసుకొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

42 శాతం రిజర్వేషన్ల సాధనే ధ్యేయం



గజ్వేల్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళిత సంఘాలు, సీఐటీయూ నాయకులు

దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నేత యాదగిరి

గజ్వేల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా పోరాటం ముమ్మరం చేస్తామని దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి చెప్పారు. బీసీ రిజర్వేషన్ సాధనలో భాగంగా డిసెంబరు 27న నిర్వహించనున్న కార్యక్రమాలకు చెందిన పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 రిజర్వేషన్ సాధన ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నేత ఎల్లయ్య, వివిధ సంఘాల నాయకులు మనోహర్, రాజు, రవి, ప్రభాకర్, స్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు విఫలం

ఎంపీటీసీల ఫోరం మాజీ నేత దేవీరవీందర్



మాట్లాడుతున్న దేవీరవీందర్

గజ్వేల్: ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్, బీజేపీలు పూర్తిగా విఫలమయ్యాయని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్ అన్నారు. గజ్వేల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు యూరియా కొరతతో రైతులు అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవాల్సిన ఆ పార్టీలు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మధు, నవాజ్‌మీరా, మెట్టయ్య, దుర్గాప్రసాద్, కనకయ్య, స్వామిచారి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజు

సిద్దిపేటజోన్: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు చెప్పారు. స్థానిక తాడూరి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన డీలర్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్ల కమీషన్ డబ్బులు నేరుగా జిల్లా సివిల్‌సప్లై ఆఫీసు నుంచి డీలర్లకు జమచేయాలన్నారు. అంతకు ముందు జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నాగరాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవీందర్ మొనయ్య, గోపాల్, శ్రీనివాస్, మునిర్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలతో అప్రమత్తం



డెంగీతో బాధపడుతున్న కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంరెడ్డి


జగదేవ్‌పూర్(గజ్వేల్): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీఓ రాంరెడ్డి అన్నారు. మండలంలోని తిగుల్ గ్రామంలో డెంగీ జ్వరంతో బాధపడుతున్న చిన్నారి పూజను ఆదివారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామాల్లో ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేందర్, ఆశా వర్కర్ బీబీ, వీఓఏ కల్పన తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని ఇర్కోడ్ బాలికల వసతి గృహంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టులకు ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి జాలిగాం హేమలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఏడో తరగతి ఉత్తీర్ణులైన వారు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెరువు కట్టకు రంధ్రం

ఆదమరిస్తే ప్రమాదం



పెద్ద చెరువుకట్ట మధ్యలో ఏర్పడిన రంధ్రం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని పెద్దచెరువు కట్ట మధ్యలో పెద్ద రంధ్రం ఏర్పడింది. ఈ కట్ట గుండా నిత్యం రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఏ మాత్రం ఏమరుపాటుగా వెళ్ళినా ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. అంతే కాకుండా కట్టపై పలు చోట్ల పగుళ్లు ఏర్పడటంతో వాహనదారులు బయాందోళన చెందుతున్నారు. మరింత వర్షం కురిస్తే బుంగగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి 'యోగా'కు మిట్టపల్లి విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేటలో జరిగిన యోగా పోటీలలో మిట్టపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. విద్యార్థులు పి.అభినయశ్రీ, పి.రామ్‌చరణ్ బంగారు పతకాలు, భాను ప్రసాద్ రజితం పతకం సాధించారు. వారు నిర్మల్ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు రజనీని అభినందించారు.

గణేశుడికి ఘనమైన పూజలు

వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మండపాల వద్ద సందడి కొనసాగుతోంది. ఈ సందర్భంగా మండపాల వద్ద బొజ్జ గణపయ్యకు ఆదివారం ఘనంగా పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



గజ్వేల్‌రూరల్: లక్ష్మీప్రసన్ననగర్ కాలనీలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



దుబ్బాకలో పిల్లలకు పుస్తకాలు, పలకల పంపిణీ



కొండపాకలో పాండిచ్చేరి ఐపీఎస్ అధికారి బుద్ధి అఖిల్ పూజలు



బెజ్జంకి మార్కండేయ ఆలయం వద్ద హోమం..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న గణనాథులు



చిన్నకోడూరు(సిద్దిపేట): చంద్లాపూర్‌లో కుంకుమార్చన



గజ్వేల్‌లో గణపతికి క్షీరాభిషేకం